మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# తండా సమస్యలు తీరుస్తా..

- శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..
- తండా అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా ఉండాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మహ్మద్‌ఖాన్ పల్లి తండా సమస్యలు తీరుస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహబూబ్‌నగర్ నగరపాలక పరిధిలోని మహ్మద్ ఖాన్ పల్లి తాండా 16వ వార్డులో కొలువైన శ్రీ వీర ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో జరిగిన ధ్వజస్థంభం ప్రతిష్టాపన మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వీరాంజనేయ స్వామి సంపూర్ణ కటాక్షం గ్రామ ప్రజలందరి పైన ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని అందరం కలిసి అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందాం అన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలంతా కలిసి కట్టుగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వాదం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు మోతిలాల్, జాజి మొగ్గ నర్సింహులు, దేవేందర్ నాయక్, అబ్దుల్ హక్, శ్రీనివాస్ యాదవ్, జోజ్యు నాయక్ , డి.ఎం.నాయక్, మాజీఎంపిటిసి గోపినాయక్, శరత్‌చంద్ర, హన్మంతునాయక్, కృష్ణ, కుమార్, రవినాయక్, శంకర్ నాయక్, గోపాల్, చర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# రహదారుల విస్తరణ పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో రహదారుల విస్తరణకు సంబంధించి పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రహదారుల విస్తరణ పెండింగ్ పనులపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో రహదారుల విస్తరణకు సంబంధించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాల నుండి పెబ్బేరు రోడ్డు వైపు రహదారి, పానగల్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, సహా మిగతా పెండింగ్ రహదారుల విస్తరణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. సంబంధిత మార్గాల్లో ఉన్న ఇళ్లకు మార్కింగ్ ఇవ్వకపోతే వారంలోపు ఇవ్వాలని సూచించారు. ఆయా ఇళ్లకు సంబంధించి ఇదివరకే పరిహారం ఇచ్చి ఉంటే వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనులు ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఆర్‌అండ్‌బి అధికారులు దేశా నాయక్, సీతారామస్వామి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం..

### మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త):** మక్తల్ నియోజకవర్గంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని, నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని గుడిగండ్ల రేషన్ దుకాణం వద్ద బుధవారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మన రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగే గ్రామంలో దాదాపు 50మంది కుటుంబాలకు నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 30మందికి పైగా పేదలకు ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ రమేష్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు రమేష్, భరత సింహా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శించిన

# మంత్రులు జూపల్లి, తుమ్మల



స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శిస్తున్న మంత్రులు జూపల్లి, తుమ్మ, ఎమ్మెల్యేలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:**గుజరాత్‌లోని సత్పురా, వింధ్యాంచల్ పర్వత శ్రేణుల్లోని నర్మదా నది తీరంలో కెవాడియా ప్రాంతంలో ఉన్న సర్దార్ వల్లభాయి పటేల్ ఐక్యతా (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) విగ్రహాన్ని, టెంట్‌సిటీని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులు సందర్శిం చారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశంలో నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చామని అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాలను సందర్శించి, తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేస్తున్నా మని, దీంట్లో భాగంగానే -మిగతా2లో..

### సాహస యాత్ర

# మూడు రోజులే..



స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు ( ఫైల్)

- రేపటి నుంచి సలేశ్వరం సాహసయాత్ర ప్రారంభం
- శుక్రవారంతో మొదలై ఆదివారంతో ముగియనున్న లింగమయ్య దర్శనం
- ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అనుమతి
- నల్లమలలో మార్మోగన్ను లింగమయ్య నామస్మరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



సలేశ్వరంలో వెలసిన లింగమయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** సలేశ్వరం సాహసయాత్ర ప్రారంభమైంది. తెలంగాణ అమర్‌నాథ్‌యాత్రగా పేరుగాంచిన ఈ యాత్ర శుక్రవారంతో మొదలై ఆదివారంతో ముగియనున్నది. గతంలో ఐదు రోజులు యాత్రకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం మూడు రోజులకే కుదించింది. జాలువారే జలపాతం..చుట్టూ కొండలు..గుట్టలు దాటుతూ రాళ్ల రప్పల మీదుగా కాలినడకన కిలోమీటర్ల మేర పయనం సాగించాల్సి ఉన్నది. యేటా వచ్చే చైత్రపౌర్ణమి సందర్భంగా యాత్ర సాగుతుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలిస్తుంటారు. లింగమయ్యను దర్శించాలంటే భక్తి మాత్రమే కాదు, సహనం, సాహసం కూడా ఉండాలి. దట్టమైన అడవిలోని గుహలో కొలువైన ఆ స్వామి భక్తులకు దర్శనం ఇచ్చేది ఏడాదికి కేవలం మూడు రోజులే.

**వస్తున్నాం లింగమయ్య అంటూ..**

నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో అత్యంత సాహసోపేత ప్రయాణంతో కాలినడకన సాగే సలేశ్వరం యాత్ర వస్తున్నాం లింగమయ్య..అంటూ స్వామి నామస్మరణతో ప్రారంభమై తిరుగు ప్రయాణంలో వెళ్లొస్తాం లింగమయ్య అంటూ భక్తుల నామస్మరణల మధ్యం యాత్ర సాగుతుంది. కరోనా కారణంగా రెండేండ్లు యాత్రను నిలిపివేసిన ప్రభుత్వం అనంతరం లింగమయ్య దర్శనాన్ని మూడు రోజులకు కుదించింది. ఎండలో పాదయాత్ర చేసుకుంటూ సలేశ్వరం చేరుకున్న భక్తులకు అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణలో చల్లని కొండలు గుట్టల నడుమ ఉపశమనం కలుగుతుంది. సుమారు 200అడుగుల పై నుంచి జాలువారే జలపాతంలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో లింగమయ్యను దర్శించుకుంటున్నారు.

**ఇలా వెళ్లాలి..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి యాత్రకు వెళ్లేవారు నాగర్‌కర్నూల్ అక్కడి నుంచి అచ్చంపేట దోమలపెంట మీదుగా ఫరహాబాద్ చౌరాస్తాకు చేరుకోవాలి. నల్గొండ జిల్లా నుంచి మల్లేపల్లి, దేవరకొండ, డిండినుంచి హాజీపూర్ చౌరాస్తాకు చేరుకోవాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుంచి వచ్చే యాత్రికులు హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా మన్ననూరు చేరుకొని అక్కడి నుంచి ఫరహాబాద్ చౌరాస్తాకు చేరుకోవాలి. సలేశ్వరం యాత్రకు ఉదయం 7గంటల నుంచి మాత్రమే అనుమతి ఉంటుంది. సాయంత్రం 6తర్వాత వెళ్లడానికి అనుమతి ఇవ్వరు.

**ఎక్కడి నుంచి ఎంత దూరం..**

హైదరాబాద్ నుంచి ఫరహాబాద్ చౌరాస్తాకు 157 కి.మీ., మహబూబ్‌నగర్ నుంచి 131కి.మీ., నల్గొండ నుంచి 141కి.మీ. అచ్చంపేట నుంచి 38, మన్ననూరు నుంచి 18కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంటుంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఫరహాబాద్ నుంచి అప్పాపూర్ చెంచుపెంట, రాంపూర్ చెంచు పెంట మీదుగా సుమారు 30కి.మీ. ప్రయాణం చేసి అక్కడి నుంచి తిరిగి ఆటోలో 2కి,మీ. ప్రయాణం, అక్కడ నుంచి 3కి.మీ. కాలినడన కొండలు గుట్టలు దాటుతూ సలేశ్వరం చేరుకోవాల్సి ఉంటుంది.

**ఆర్టీసీ బస్సు సౌకర్యం..**

ప్రతి యేటా జాతరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నది. సలేశ్వరం యాత్రకు తెలంగాణలోని పలు డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కల్వకుర్తి, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల నుంచి బస్సు సౌకర్యంఏర్పాటు చేసింది. నల్గొండ లోని దేవరకొండ, మిర్యాలగూడ, నల్గొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం ఉంది. ఈ పురాతన ఆలయం ఎన్నో విశేషాలకు నిలయం. సలేశ్వరం యాత్రను అమరనాథ్ యాత్రతో భక్తులు పోల్చుతూ ఉంటారు.

**పండితారాధ్య చరిత్రలో..**

క్రీస్తుశకం 13వ శతాబ్దం నాటి మల్లికార్జున పండితారాధ్య చరిత్రలో సలేశ్వర క్షేత్రం గురించి పాల్కురికి సోమనాథుడు వైభవంగా వర్ణించాడు. 16వ శతాబ్దంనాటి శ్రీ పర్వత పురాణంలో... ఈ గుహాలయం గురించి, ఇక్కడి సర్వేశ తీర్థం, పుష్కర తీర్థం గురించి ప్రస్తావనలు ఉన్నట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. విష్ణుకుండినులు, చాళుక్యుల కాలంలో జరిగిన నిర్మాణాలు ఈ ఆలయంలో ఉన్నాయి. ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే తెరిచి ఉండడం ఈ ఆలయం ప్రత్యేకత.

**11రోజుల నుంచి 3రోజులకు..**

30ఏండ్ల కిందట 11రోజుల పాటు సలేశ్వరం దర్శనానికి అవకాశం ఉండేది. దారులన్నీ తెరిచి ఉంచేవారు. తరువాత భద్రత తదితర కారణాల వల్ల ఏడు రోజులకు, అయిదురోజులకు, చివరకు మూడు రోజులకు కుదించారు. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమికి అటు రెండు రోజులు, ఇటు రెండు రోజులు సలేశ్వర స్వామి ఆలయాన్ని తెరిచి ఉంచే అనవాయితీ కొన్ని ఏళ్ళు కొనసాగింది. ప్రస్తుతం మూడు రోజులే తెరుస్తున్నారు. ఫాల్గుణ మాసంలోనే ఏర్పాట్లు మొదలవుతాయి.

# తెలంగాణలో వచ్చేది బిజెపి అధికారమే

### ఏ ఎన్నికైనా గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి : ఎంపి డికె అరుణ




మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** తెలంగాణలో వచ్చేది బిజెపి అధికారమని పాలమూరు ఎంపీ డీకే అరుణ, బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పాలకులు మారారు కానీ పాలన మారలేదని ఈ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఏ ఎన్నిక అయినా బిజెపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపు నిచ్చారు. బుధవారం నారాయణపేటలో జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడు సత్య యాదవ్ పదవి బాధ్యతల స్వీకరణ ఉత్సవం అట్టహాసంగా జరిగింది. సత్య యాదవ్‌ను కార్యకర్తలు అభిమానులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణ మాఫీ పూర్తి కాలేదు, ఏడాది అయినా రైతు భరోసా పూర్తిగా లేదని, మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే గృహజ్యోతితో మహిళలను మోసం చేశారని, వృద్ధులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఫలమైందన్నారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకోవడం లో రెండు పార్టీలు ఒక్కటేనని, అంతే కాకుండా పదేళ్ల బిఆర్ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లిస్తున్నదని విమర్శించారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని పాతరవేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆడబిడ్డలు ఆక్రందనలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ నినాదంతో చేపట్టిన సంక్షేమ పథకాలను, వక్ఫ్ బోర్డు రద్దీతో ముస్లింలకు ఏమి నష్టం లేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని బిజెపి గెలుపుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపితం చేసి రానున్న స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండు రెడ్డి, బి.కొండయ్య మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీని పటిష్టం చేయాలని దిశానిర్దేశం చేశారు.

**నమ్మకాన్ని వమ్ము చేయను**

**నూతన అధ్యక్షుడు సత్య యాదవ్**

తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం బిజెపి జిల్లా అధ్యక్షుడు చేసిన పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని జిల్లాలో పటిష్టం చేస్తానని పదవి బాధ్యతలు చేపట్టిన బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ అన్నారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తల కష్టాన్ని తన కష్టంగా భావిస్తానని అన్నారు. పార్టీ పెద్దలు, కార్యకర్తల సలహాలు పాటించి రానున్న ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతామని అన్నారు. తమకు ఇప్పుడు ఎంపి రూపంలో పవర్ ఉందని తమ చిరకాల స్వప్నం అయిన బిజెపి ఎమ్మెల్యేలను జిల్లాలో చూడాలని ఉందని ఆ కల సాకారం చేసుకుంటామని అన్నారు. అనంతరం సత్య యాదవ్‌ను కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున సన్మానం చేశారు. అంతకుముందు మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రతి పైసా పేద పిల్లల చదువుకోసమే..

- మన అందరి లక్ష్యం ఒక్కటే కావాలి
- విద్యానిధి మహా యజ్ఞంలో పాలు పంచుకుంటున్నందుకు కృతజ్ఞతలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- మహబూబ్‌నగర్ విద్యా నిధికి భారీ విరాళం ఇచ్చిన మహబూబ్‌నగర్ టీఎన్‌జిఓ సంఘం సభ్యులు




కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న టీఎన్జీవో సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్‌బ్యూరో ఏప్రిల్9 ప్రభాతవార్త:** వివిధ రంగాల్లో ప్రజలకు సేవ చేస్తున్న మన అందరి లక్ష్యం ఒక్కటే కావాలని, అది మహబూబ్‌నగర్ అభివృద్ధే అయ్యి ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జరిగిన ఓ కార్యక్రమంలో, మహబూబ్ నగర్ విద్యానిధికి టిఎన్‌జిఓ ఆధ్వర్యంలో రూ. 10 లక్షల భారీ విరాళాన్ని ఎమ్మెల్యే సమక్షంలో టీఎన్జీవో నాయకులు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది గొప్ప మార్పు అని నేను భావిస్తున్నాను అని, పేద విద్యార్థుల కోసం సమకూర్చే విద్యా నిధి అనే యజ్ఞంలో మీరు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. మీరు ఇచ్చే ప్రతి పైసా కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యకోసం, పాఠశాలలో అవసరమైన వనరులు సమకూర్చడం కోసం, విద్యార్థులకు స్కిల్స్ పెంచడానికి, సంస్కృతిక వారసత్వాన్ని అందించడానికి, సమగ్రమైన అభివృద్ధి కోసం ఈ మహబూబ్ నగర్ విద్యా నిధిని వినియోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంచి కనుమరుగు కాలేదని, ఇంకా మనుషుల్లో మంచి దాగుందన్న విషయం సుస్పష్టంగా ఈరోజు నిరూపణ అయిందన్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ మహబూబ్ నగర్ విద్యా నిధికి చేయూత ఇస్తున్నారని ఆయన చెప్పారు. విద్య, వైద్య రంగంలో గత పది సంవత్సరాలు మనం చాలా వెనుక పడ్డామని, విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని, మన రాష్ట్రం దేశంలో 35వ స్థానంలో ఉందని ఆయన చెప్పారు. మన మహబూబ్ నగర్ పిల్లలకు మంచి విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, అందుకే మనం మహబూబ్ నగర్‌లో ఉండే ప్రతి ఒక్కరూ తమ సంవత్సర సంపాదనలో కేవలం ఒక్క రోజు సంపాదన మహబూబ్ నగర్ విద్యా నిధికి విరాళంగా అందించాలని ఆయన ఉద్యోగులకు, వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, టిఎన్జీఓ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రా నాయక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# శ్రీ గురులోక్ మాసంధ్ ప్రభు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

**మద్దూర్,ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లిలో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్‌ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా విఐపి మేనేజ్ మెంట్ జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ పరంగా ఏం ఏర్పాట్లు చేశారని అడిగారు. ఆలయానికి, రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని ఈ.వో తెలిపారు. జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 15 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేయగా ప్రస్తుతానికి ఇద్దరు వచ్చి విధుల్లో చేరారని, మిగతా 13 మంది రెండు రోజుల్లో వస్తారని ఈవో తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో 8 సీసీ కెమెరాలు అమర్చుతామని ఈవో తెలపగా, పోలీసు శాఖ కోరినట్లు మొత్తం 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించామని, అలాగే 8 బ్లాకుల్లో రెండింటిలో స్లాబ్ వేయించామని, టైల్స్, ఆన్ ఆఫ్ ట్యాప్ క్లిప్పులను ఫిట్ చేయాల్సి ఉందని మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. రెండు పవర్ బోర్లకు మోటార్లు బిగించాల్సి ఉందన్నారు. శానిటేషన్ పరంగా దాదాపు 300 మంది కార్మికులతో పారిశుధ్య సేవలు చేస్తామని, మూడు. షిఫ్టులలో వందమంది చొప్పున కార్మికుల సేవలు అందుబాటులో ఉంటాయని డీఎల్‌పీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. జాతర 4రోజులు తిమ్మారెడ్డిపల్లిలో సెల్ ఫోన్లు కలవు అని, తమకు వాకీ టాకీలు ఇవ్వాలని డీఎల్‌పివో సుధాకర్ జిల్లాఎస్పీ యోగేష్ గౌతమ్‌ను కోరారు. జాతరలో ఒకడాక్టర్, సూపర్ వైజర్ ,ఏఎన్ఎం, ఆశాలతో మూడు సిఫ్టులలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఇంచార్జీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శైలజ తెలిపారు. జాతరలో బారికేడ్లు ఏర్పాటుచేస్తామని పిఅర్ అధికారి విలోక్ చెప్పారు. అగ్నిమాపక శాఖపరంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగినచర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల కోసం కోస్గి డిపో నుంచి 8బస్సులు నడిపిస్తామని, మహబూబ్‌నగర్ డిపో నుంచి అదనంగా మరికొన్ని బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిఎం లావణ్య తెలిపారు. జాతరలో భక్తుల కోసం -మిగతా2లో..

వార్త విలేకరులు కావలెను

ప్రముఖ తెలుగు జాతీయ దినపత్రిక వార్తలో వివిధ మండలాలకు పనిచేయుటకు విలేకర్లు కావలెను.

విలేకరులు కావాల్సిన ప్రాంతాలు

వనపర్తి జిల్లా : పెద్దమందడి, కొత్తకోట, రేవల్లి, గోపాల్‌పేట, మదనాపురం

అర్హత : ఇంటర్, డిగ్రీ తెలుగు భాషపై పట్టు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

ఇంటర్వ్యూ తేది:

తేది: 13.04.2025 (ఆదివారం) ఉదయం 11 గం.కు జడ్చర్ల వార్త కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

సెల్: 9441615424,9866340034

## స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతాం

**పెబ్బేరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలో బుధవారం బిజెపి సమీక్ష సమావేశం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర నాయకులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి సత్తా చాటు తుందని, మహిళలు, యువత బిజెపి వైపే మొగ్గు చూపుతున్నారని గత ఎన్నికల్లో కూడా పెబ్బేరు మండలం బిజెపికి పూర్తి మెజార్టీ ఇచ్చిందని అదేవిధంగా స్థానిక ఎన్నికల్లో బిజెపిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దీనిపై ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తి వ్యతిరేకత, అసహనం వ్యక్తం చెందుతున్నారని మరో పక్క నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొన్నదని దేశంలో అవినీతి రహిత సుపరిపాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బిజెపి అని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు ప్రత్యక్షంగా, స్వయంగా, అవినీతి రహితంగా, చేయడంలో ప్రజలు చాలా సంతృప్తిగా ఉన్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ గౌని వేమారెడ్డి, పట్టణ అధ్యక్షుడు క్రాంతి నాయుడు, డిస్టిక్ కౌన్సిల్ నెంబర్ రంగస్వామి గౌడ్, నాయకులు కంచ ఆంజనేయులు, రామకృష్ణ, సర్వేష్ గౌడ్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి

## మూలమల్ల గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు

**ఆత్మకూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** ఆత్మ కూరు మండలంలోని మూలమల్ల గ్రామం లో బుధవారం అంబేద్కర్ యువజన సంఘం, భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వ ర్యం లో గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకుగా ను చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోనిపై రెండు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిధులను సేకరించి వేసవికాలంలో సామాన్యుల దాహార్తిని తీర్చేందుకుగాను చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయాసంఘాల నాయకులు తెలిపారు. ఇందుకుగాను మొదటి రోజు గ్రామస్తులకు చలివేంద్రం ఆవరణలో అంబలి సరఫరా చేసి దాహార్తిని తీర్చారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ వేసవికాలంలో సామాన్యుల దాహార్తి ని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల నాయకులు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రవీణ్ కుమార్ భరత్ మాజీ ఎంపిటిసి సభ్యులు భీమన్న ,ఆనంద్ గౌడ్, భాస్కర్ ,రాజశేఖర్ రెడ్డి తదితరులతో పాటుగా పలువురు గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మూలమల్ల గ్రామంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం

## రాజస్థాన్‌లో రైతులకు యోగిక్ అగ్రికల్చర్ శిక్షణ

**పెబ్బేరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణానికి చెందిన రైతు ప్రవీణ్ కుమార్ రెడ్డి రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నందు తెలంగాణ రాష్ట్రం నుండి 45 మంది రైతులకు శాశ్వత యోగి అగ్రికల్చర్ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున రైతులు పాల్గొన్నారు. పెబ్బేర్‌పట్టణానికి చెందిన రైతు ప్రవీణ్ కుమార్ రెడ్డికి ఆహ్వానం రావడం హర్షించదగ్గ విషయమని వారు తెలిపారు. శిక్షణ నాలుగు రోజుల కార్యక్రమంలో వ్యవసాయంలో రసాయను ఎరు వులు, పురుగుల మందులు వల్ల కలిగే దుష్పరిమానాలు ప్రకృతి కాలుష్యం అవుతున్న విధానం జరిగే ప్రకృతి వైపరీత్యాలు ఆహారం విషాహారంగా మారడం ఈ పరిమణామాల నుండి విముక్తి జరగాలంటే ముందుగా ప్రకృతిని అర్థం చేసుకోవడం ఆ పకృతిని వలయం నుండి బయట పడేందుకు సంకల్పాన్ని తీసుకొని భూమిని అర్థం చేసుకొని సాగుభూమి సంస్కరణ చేసి ఎవరి విత్తనాన్ని వారు తయారు చేసుకుని భూమిలో సూక్ష్మ వాతావరణంలో పంటలకు మేలుచేసే సూక్ష్మజీవుల పెరుగుదలకు తోడ్పడే చర్యలు చేపట్టి పచ్చి రొట్ట ఎరువులవినియోగం పెంచడలాంటి పద్ధతులు పాటించాలని ఈ శిక్షణలో తెలియజేశారని పాల్గొన్న రైతులకు షీల్డ్,సర్టిఫికెట్స్ అందజేశారని రైతు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలియజేశారు.



బ్రహ్మ కుమారిస్ వారు నిర్వహించిన మౌంట్ అబూ వారు పెద్ద రైతు ఫీల్డ్ సర్టిఫికెట్ ప్రధానం

## శ్రీ గురులోక్ మాసంధ్ ప్రభు

## బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

దుస్తులు మార్చుకునే షెడ్లను ఏర్పాటుచేయడంతో మొబైల్ టాయిలెట్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు.విద్యుత్‌శాఖపరంగా అవసరమైన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనట్లు మొబైల్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఉంచుతామని విద్యుత్తు శాఖ అధికారి తెలిపారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జాతరలో దొంగతనాలు, ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిఎస్పి నల్లపు లింగయ్య, సీఐ సైదులు, తహసిల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శించిన మంత్రులు

మొదటి పేజీ తరువాయి భాగం..

స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, టెంట్ సిటీని సంద ర్శించామని మంత్రి జూపల్లి తెలిపారు. 2027-2028 సంవత్సరాల్లో తెలంగాణలో జరగనున్న గోదావరి, కృష్ణ పుష్కరాలకు సంబంధించి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టెంట్‌సిటీలో ఉన్న వసతులను అధ్యయనం చేశామని చెప్పారు. ఇలా తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రుల వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, డా. రాజేష్ రెడ్డిలు ఉన్నారు.

## కొల్లూరులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం

**నవాబుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పేదలకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా ప్రతిఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్‌రెడ్డి ఆదేశానుసారం నియోజకవర్గం, నవాబుపేట్ మండలం, కొల్లూరు గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ రేషన్ దుకాణాల్లో గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నవాబుపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసిరామ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఖాజామైనోద్దీన్, లంబ వెంకటయ్య, వాసు యాదవ్, కృష్ణ గౌడ్, నరసింహచారి, జంగయ్య, గౌరయ్య, జగన్, కృష్ణయ్య, వెంకటయ్య, గణేష్, రవి, గోపాల్ యాదవ్, కొల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు తదితర లు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడే చిత్రకారుడు

## బంక మట్టితో అద్భుతాలు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలోని యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడైన రాయినిపల్లి శ్రీనివాస్ విద్యార్థులకు బంకమట్టితో అద్భుతాలు చేయవచ్చునని నిరూపించారు. ఈనెల 11న మహాత్మ జ్యోతిబాపూలే జన్మదినాన్ని పురస్కరించుకొని పూలే మట్టి విగ్రహాన్ని బంకమట్టితో తయారుచేసి విద్యార్థులకు చూపించారు. విద్యార్థులు చదువుతోపాటు, విద్యా బోధనకు అనుబంధంగా విద్యార్థులు తమ ప్రతిభను అనుసరించి వివిధ రకాల కార్యకలాపాలు చేసి తమ సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని సందర్భంలో ఉపాధ్యాయుడు తానే స్వయంగా పూలే విగ్రహాన్ని తయారుచేసి చూపించడం జరిగింది. విద్యార్థులు కూడా తమకిష్టమైన కలలను చిత్రాలు వేయడం, క్రీడలు ఆడడం, పాటలు పాడడం వంటి కార్యకలాపాలను చదువుతో పాటు తమకిష్టమైన కళను ఉపయోగించి భవిష్యత్తులో మంచి విజయాలను అందుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. అని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఉపాధ్యాయిని పాఠశాల హెచ్ఎం రామచంద్రయ్య,ఉపాధ్యాయ బృందం, తదితరులు అభినందించారు.



బంక మట్టితో విగ్రహాలను తయారు చేసి విద్యార్థులకు చూయిస్తున్న ఉపాధ్యాయుడు

# నకిలీ సీడ్స్‌పై రైతులను చైతన్యపరచాలి

**గద్వాల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పంట పండించే ఏ రైతు నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్ పై ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా లోకి నకిలీ విత్తనాలు రావడం గానీ, వినియోగం కానీ జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల పాటు రాష్ట్ర డీజీపి రాష్ట్రం లోని అన్ని పోలీస్ కమిషనరేట్ ల పోలీస్ అధికారులతో, జిల్లా ఎస్పీ లతో నేరాల పై రివ్యూ సమావేశ నిర్వహించి పలు సూచనలు ఇచ్చిన సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజాలలో పోలీస్ పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా చేపట్టాల్సిన విధులు, నేరాల నియంత్రణ, శిక్షల శాతం పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రాబోయే వర్ష కాలం ను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల నుండి నకిలీ సీడ్స్ జిల్లా లోకి రావడం గాని, జిల్లా నుండి రవాణా కానీ జరగకుండా పూర్తిగా నియంత్రించాలని, అందుకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని, అవసరం ఐతే పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చెయ్యాలని ఆదేశించారు. ఆరుగాలం శ్రమించి పంటలను పండించే రైతన్న నకిలీ సీడ్స్ తో మోసపోకుండా చూడాలని, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ లను ఏర్పాటు చేసి నిఘాతో పాటు తనిఖీలు నిర్వహించాలని నకిలీ సీడ్స్ పై ప్రజలను చైతన్యం చెయ్యాలని అన్నారు. ప్రజలకు పోలీస్ పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా పోలీస్ విధులు ఉండాలనీ, వచ్చిన పిర్యాదు పై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని, ఆయా కేసులలో నిందితులకు పడే శిక్షల శాతం మరింత పెరిగేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని, ట్రయాల్స్ సమయంలో ఉన్నతాధికారులు మానిటర్ చెయ్యాలని, అలాగే టెక్నాలజీ వినియోగను, పోలీస్ మాన్ పవర్ ను మాక్సిమం ఉపయోగించుకోవాలని అన్నారు. రైటర్స్, సీసీటీఎన్ ఎస్, రిసెప్షన్, సిడిఓ ఎస్ కు వర్టికల్ వారిగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్, ప్రాపర్టీ నేరాలు జరుగకుండ ముందస్తు సమాచారం తోనే నియంత్రించాలని, రాత్రి గస్తీ ను మరింత పెంచాలని అవసరమైతే పట్టణాలలో సైక్లింగ్ చేస్తూ గస్తీ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్స్ ను గుర్తించి ఆ ప్రాంతాల్లో తగిన మార్పులు చేర్పులు చేపట్టాలని, ప్రతీ ఫ్యాటల్ రోడ్డు ప్రమాదం ను ఎస్‌హెచ్‌ఓ స్వయంగా సమీక్షించాలని అన్నారు. రోజూ ఎక్కువ మొత్తం లో తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు నమోదు చెయ్యాలని అన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

### ప్రజలలో పోలీస్ వ్యవస్థ పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా విధులు నిర్వహించాలి... పోలీస్ అధికారుల సమావేశంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

జాతీయ రహదారి జంక్షన్స్ దగ్గర, జిల్లా లోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీ వార్డు లలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన చోట పని చెయ్యని కెమెరాలను పునరుద్ధరించడం లేదు మార్పు చెయ్యడం చెయ్యాలని అన్నారు. అన్ని కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానించి పర్యవేక్షించాలని అన్నారు. అధికారులు తమ పరిధిలో శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి అని, నిత్యం ఫీల్డ్ లో ఉండాలనీ, హత్య కేసులో నిందితులుగా ఉన్న వారి పై రౌడీ షీట్స్ ఓపెన్ చెయ్యాలని అన్నారు. సోషల్ మీడియా లో ఎల్లప్పుడూ నిఘా ఉంచాలని, గ్రామ లలో వాట్సాప్ గ్రూపులల్ సైతం నిఘా ఉంచాలని అన్నారు. మహిళ ల పై జరిగే నేరాలు, వేధింపుల పై అలసత్వం వద్దని, అట్టి ఫిర్యాదుల పై వెంటనే స్పందించాలని సూచించారు. బెట్టింగ్ వ్యసనం వైపు యువత వెళ్లవద్దని, బెట్టింగ్ లు అడిన, ఆడించిన అట్టి వారి పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగం జిల్లాలో కనిపించనప్పటికీ వాటి సరఫరా ,వినియోగం పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలోడి.ఎస్పి వై మొగులయ్య, గద్వాల్, ఆలంపూర్, శాంతి నగర్ సీఐ లు టంగుటూరి శ్రీను, రవి బాబు, టాటా బాబు , సీసీ ఎస్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై, ట్రైనీ ఎస్సైలు,పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి న్యాయం చేయండి

**ఆత్మకూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూర్ మూడు ముక్కలుగా ఏర్పడి తీవ్ర అన్యాయానికి గురైన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రస్తుత మున్సిపల్ కేంద్రంగా కొనసాగుతున్న ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసి న్యాయం చేయాలని ఆత్మకూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరులోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలోగల బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాలుగా ఆత్మకూరు సంస్థానంగా వెలుగొంది ఇక్కడి నుండి ప్రజలకు విశేష సేవలందించిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ప్రస్తుతం సబరిస్త్రారు కార్యాలయం, కోర్టు, ఎస్ టి ఓ తదితర కార్యాలయాలు పట్టణంలోనే ఉన్న నేపథ్యంలో రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసేందుకు ఆత్మకూరుకు అన్ని అర్హతలు ఉన్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే గుర్తించి ఇప్పటికే అసెంబ్లీలో చర్చించిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అమరచింత, ఆత్మకూర్, నర్వ ,చిన్నచింతకుంట, మదనాపూర్ మండలాలను కలిపి ఆత్మకూరును తక్షణమే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత శాసనసభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆత్మకూరును తక్షణమే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరికి నియోజకవర్గ ప్రజలంతా అండదండల అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు వై తిప్పారెడ్డి ,జీకే రాములు, దివాన్జి అశోక్ కుమార్ ,నారాయణ గౌడ్ ,ముక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

## కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి

**అమరచింత, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం అమరచింత మండల కేంద్రంలోని బస్టాండులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, జీఎస్ గోపి,సిపిఎం మండలనాయకులు,బి వెంకటేష్, అజయ్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచారని వారు అన్నారు. కేంద్రంలో సిలిండర్ ధరలు పెంచడం వల్ల పేద ప్రజలపై భారం పడుతుందని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ రాష్ట్రాలలో ఉన్న పేదలపై ఏడాదికి 100 కోట్ల భారం పడుతుందని వారు అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకుల ధరలపై నియంత్రీకరణ చేస్తామని వాగ్దానం చేసిన ఇప్పటివరకు బిజెపి ప్రభుత్వం అన్ని రకాల వస్తువులపై ధరలను పెంచిందని వారు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరతో పాటు నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి విష్ణు శ్యాంసుందర్, బుచ్చన్న, శ్రీను, కురువ రాము, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.




అమరచింతలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలకు వ్యతిరేకంగా నిరసన

## రైతుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**ఆత్మకూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయడంతో పాటుగా రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటూ సిపిఐ అనుబంధ సంఘమైన తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరులోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి తెలంగాణ రైతు సంఘం వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాబర్ట్ మోష తదితరులు మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే రైతులఖాతాల్లో రుణమాఫీ నిధులను జమచేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాబోయే ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కల్పించకుండా ఎరువులను విత్తనాలను సకాలంలో అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత రబీ సీజన్లో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఆయకట్టు రైతాంగానికి వారబందీ ప్రకారం నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని లేనిపక్షంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేయాలనిలేని పక్షంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు.అనంతరం ఆత్మకూర్ తహశీల్దార్ చాంద్ పాషాకు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం నాయకులు భారతీయుడు వెంకట రాములు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.




ఆత్మకూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

## డికే అరుణమ్మ ఆదేశాల మేరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం

**కేటిదొడ్డి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మండల కేంద్రములో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికే అరుణమ్మ ఆదేశాల మేరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అధ్వర్యంలో, రాష్ట్ర బిజెపి పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా ఇంఛార్జి రజక నర్సింహులు, కేటి దొడ్డి మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడుతూ... పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 6 నుంచి 14 వ తేదీ వరకు జరిగే ప్రతి కార్యక్రమంను దిగ్విజయం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 6 వ తేదీ బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం చేసుకున్నాము, ప్రతి కార్యకర్తల ఇంటి పై జెండాను ఎగరేశాము, ఇప్పుడు ముఖ్య కార్యకర్తల సమావేశం, జరుపుకుని రేపటి నుంచి ఇల్లు ఇల్లు తిరిగి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చెబుతూ, నేరుగా ప్రజలకు ఇస్తున్న పథకాలు ప్రచారం చేస్తూ, 14 వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాలను స్వతహాగా శుభ్రం చేసి అతడు దేశానికి చేసిన సేవలను తెలుపుతూ ఎస్సీ కాలనిలో చిన్న చిన్న మీటింగ్ లను ఏర్పాటు చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు రజక నర్సింహులు పిలుపునిచ్చారు. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ...11 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఏకధాటిగా పరిపాలన చేస్తూ దేశాన్ని ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా నిలబెట్టిన ప్రధాని మోదికి ధన్యవాదాలు తెలుపుతూ కులమతాలకు అతీతంగా దేశాన్ని పరిపాలిస్తున్న కొంతమంది బీజేపీ పార్టీని మతతత్వ పార్టీ అంటూ ముద్ర వేస్తున్నారు. ముస్లిం ఆడపిల్లల కోసం ట్రిపుల్ తలాక్ ను రద్దు చేసి వారికి స్వేచ్ఛ తెచ్చి వారికి హక్కులను కల్పించిన ఘనత బీజేపీ పార్టీదే వక్ఫ్ బోర్డ్ చట్టం పై కూడా బీజేపీ ప్రభుత్వంను బద్నాం చేస్తున్నారు. వక్ఫ్ బోర్డ్ ద్వారా కొంత మంది దానిపై పెత్తనం చేస్తూ వాటి భూములపై కోట్ల రూపాయలను సంపాదిస్తు వక్ఫ్ బోర్డ్ ను భ్రష్టు పట్టించారు, అనే ఆలోచనతోనే వక్ఫ్ భూముల్లో ముస్లింలు షియాలు, సున్నిలు మాత్రమే అనుభవిస్తున్నారని అందుకే ముస్లింల ఉన్న అన్ని సామాజిక వర్గాలను భాగస్వామ్యం చేసే విధంగా ఏర్పాటు చేస్తూ వక్ఫ్ బోర్డ్ ఫలాలను అందరికి చేర్చాలనే తప్పా వాటినీ లాక్కొనలాని ఆలోచన చేయడం లేదని తెలిపారు. మీరు కూడా ప్రజలకు వీటన్నింటిని వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇంచార్జ్ చిత్తారి కిరణ్, మండల బిజెపి అధ్యక్షుడు జి.శ్రీపాద రెడ్డి, జిల్లా కౌన్సిల్ హన్మి రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, ఎర్ర భీంరెడ్డి, సూర్య కాంతరెడ్డి, నాగిరెడ్డి ,మైలగడ్డ రాములు, కృష్ణకాంత్, వీరేష్, కొండయ్య, వాచ నాయక్, రాగ వేంద్ర, పూజారి మహదేవ్, రంగాపురం కృష్ణ, వివిధ గ్రామాల నుండి వచ్చిన బిజెపి ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేటి దొడ్డి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంఛార్జి రజక నర్సింహులు

## కరెంటు అధికారులు మా కరెంటు సమస్యను తీర్చండి

### ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన పట్టింపులేని అధికారులు

**పెబ్బేరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని తొమ లపల్లి కొత్త సబ్ స్టేషన్ 33/11 కె.వి గత ఏడు సంవత్సరాల చార్జింగ్ చేయడానికి అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రం ఇచ్చిన పట్టించుకోవడంలేదని దీనివలన గ్రామాలలో ఓల్టేజి సమస్యతో ఇండ్లలో కరెంటు సరిగ్గా లేకపోవడం వలన టీవీలు, ఫ్యాన్లు పనిచేయడం లేదని వ్యవసాయ పొలాల దగ్గర బోర్లు అసలుకే రావడంలేదని దీనిపై ఎన్నిసార్లు ఎస్ సి,డీఈకి వినతిపత్రం ఇచ్చిన పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా పట్టించుకోని సబ్ స్టేషన్‌కు చార్జింగ్ చేసి పలు గ్రామాలకు సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## పర్వతాపురంలో డోలహరణం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పర్వతాపురం గ్రామంలో బుధవారం టిఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లారెడ్డిమనవడి డోలానామా హరణంలో పాల్గొన్నారు. చిన్నారి అనిరుద్ రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం అదే గ్రామా నికి చెం దిన మాజీ సర్పంచ్‌నాగిరెడ్డి అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకు ని పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన దవాఖాన రా ములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలు సుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి వెంబడి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, జడ్పిటిసి సామ్య నాయక్ ,బాలిశ్వర్ రెడ్డి ,రంగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## వినికిడి యంత్రం అందజేత

**వెల్దండ,ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెంది న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అల్లడి రంగయ్య కొంతకాలంగా వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ రూ.25 వేలు వెచ్చించి వినికిడి యంత్రాన్ని బుధవారం వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డితో కలిసి మట్ట వెంకటయ్యగౌడ్ బాధితునికి అందించారు. ఈ సందర్భంగా మట్ట వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, కృపానందం, ఎండి అమీద్, మారేపల్లి శ్రీను, మహేష్, రామకృష్ణ, కొండలు, నాగార్జున, శివరాజ్, భరత్ గౌడ్ తోపాటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**మద్దూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో బుధవారం ఉర్దూ మీడియం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తోటి విద్యార్థులతో ఆనందోత్సవాల మధ్యన చిన్నారి విద్యార్థి విద్యార్థులు ఆనందంగా గడిపారు. డిఈఓ గా ఫర్వాన్, ఎంఈఓగా ఎండి సైపోద్దిన్, హెడ్మాస్టర్‌గా పబిహా బేగం, తదితరులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన అందించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు , మాజీ విద్యా కమిటీ చైర్మన్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం

**మద్దూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణ కేంద్రంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దమ్‌గన్‌పూర్ సింగిల్ విండో చైర్మన్ గుల్ల నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడు వడ్లకు రూ.2320 బి గ్రేడ్ వడ్లకు రూ. 2300 ధర కేటాయించడం జరిగిందని రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు. ఉమ్మడి మద్దూర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సింగిల్ విండో చైర్మన్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కోస్గి వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, సింగిల్ విండో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

**మక్తల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని కర్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను చక్కగా బోధించి ఆకట్టుకున్నారు. ఎంఈఓ గా సుస్మిత, హెచ్ ఎం గా భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులుగా అనుశ్రీ, అఖిల, లహరి, సునంద, మీనాక్షి, సౌజన్య, లక్ష్మమ్మ, శివ కార్తీక్, నితిన్, భాను ప్రసాద్, అర్జున్, రిషిత్, సందీప్, పీఈటీగా శివలీల, అభిషేక్ లు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. వేడుకల సందర్భంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, డి.వెంకటేష్, రమ్య, ప్రతిభ, కల్పన, తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ అధ్యక్షులు క్లబ్‌కి మూల స్తంభాలు

## -లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ



క్లబ్ మాజీ అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మాజీ అధ్యక్షులు క్లబ్‌కి మూల స్థంభాలు లాంటి వారని వారి సూచనలు, సలహాలు రాబోయే అధ్యక్షులకు మార్గ దర్శకాలుగా నిలువాలని లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హిమాలయ రెస్టారెంట్ లో మంగళవారం రాత్రి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దొడ్ల రాధారెడ్డి అధ్యక్షతన క్లబ్ సమావేశం నిర్వ హించి, గతంలో క్లబ్‌కు అధ్యక్షులుగా పనిచేసిన సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్య మానికి ముఖ్య అతిధిగా హాజరైన మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుండి నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించుకుంటూ క్లబ్ రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని, ఇందుకు గతంలో అధ్యక్షులుగా పనిచేసిన వారే కారణమని ఆయన పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షులుదొడ్ల రాధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్‌కి అధ్యక్షులుగా పనిచేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ సంవత్సరం కూడా అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించామని, గతంలో క్లబ్ అభివృద్ధికి తోడుపడిన మాజీ అధ్యక్షులనుసన్మానించుకోవడం ఒకమంచి కార్యక్రమమని,ఒక మహిళ గా నేను గర్వపడుతున్నానని అన్నారు. అధ్యక్షులు దొడ్ల రాధారెడ్డి ఆధ్వర్యంలోలో మాజీ గవర్నర్ రాధాకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. వీరితో పాటు గత అధ్యక్షులు కాబినెట్ మెంబర్ హకీమ్ విశ్వ ప్రసాద్, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, మాజీ అధ్యక్షులు దర్శి రాజయ్య, రాచూరి వెంకటరాజు, దొంతు శంకర్, లక్ష్మీనరసింహా గౌడు, చంద్ర శేఖర్‌రెడ్డి, పోలా శ్రీనివాసులు, వాస రాఘవేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్ రెడ్డి, దొడ్ల ఇందుమతి, దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,వెంకట్రాంరెడ్డి,లగిశెట్టి కోదండ రాములు, రామచంద్రరెడ్డి, ప్రేమకుమార్ రెడ్డి, రామకృష్ణరెడ్డి లను ఘనంగా సత్కరించారు. మాజీ అధ్యక్షులను ఘనంగా సత్కరించిన ప్రస్తుత అధ్యక్షులు రాధా రెడ్డి,కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి నాగరాణిలను క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి వాసలక్ష్మి, కోశాధికారినాగరాణి సభ్యులు, నరేందర్‌రెడ్డి, నెల్లి శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అచ్యుతారెడ్డి,మహేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శైలజ, స్వరూపలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బందికి ఘనంగా సన్మానం



**ఉప్పునుంతల, ఏప్రిల్9 ప్రభాతవార్త:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్క రించుకొని మండల కేంద్రమైన ఉప్పునుంతలలో శ్రీకేదారేశ్వర, చెన్న కేశవస్వామి, తేరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మో త్సవాలకు సహకరించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌తో పాటు సిబ్బందిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉత్సవాలు పూర్తి అయ్యేంతవరకు, ఆలయ ప్రాంగణంలో,క్రీడా ప్రాంగణంలో గ్రామపంచాయతీ సిబ్బందిని ఎప్పటికప్పుడు పరిశుభ్రత, పారిశుధ్యం పట్ల ప్రత్యేకంగా సహకరించినందుకు బుధ వారం కేదారేశ్వర ఆలయ ప్రాంగణంలోని గ్రామ పంచాయతీ సిబ్బందిని తేరు ఉత్సాహకమిటీ సభ్యులు కొత్తపెద్ద జంగి రెడ్డి,సూరం నారాయణరెడ్డి లు వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మా నించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. అదేవిధంగా కమిటీ చైర్మన్ కట్టనారాయణరెడ్డి, సుగుణ మ్మదంపతులు, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ పూజారులు నంబి అలివేలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తేరు ఉత్సాహ కమిటీ సభ్యులు కొత్త పెద్దజంగిరెడ్డి, సూరం నారాయణరెడ్డి, సూరంవెంకట్‌రెడ్డి, కర్నాటి సత్యం, అచ్యుతా రెడ్డి,చెన్‌రెడ్డి రాంరెడ్డి, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నాసాగర్‌లో నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

**భూత్పూర్,ఏప్రిల్ 9,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగృహంలో గురువారం 10వ తేది ఉదయం 10గంటలకు దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ తెలిపారు.ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ సభ,రజతోత్సవ వేడుకలు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రత్యేకతను సంతరించుకుందని,మండలంలోని బీఆర్ఎస్ నాయకులు సమావేశానికి విధిగా హాజరుకావాలని బస్వరాజ్‌గౌడ్ కోరారు.

# ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో బీజేపీ జెండా ఎగురాలి

## ◆ మాజీ మున్సిపల్ చైర్మన్ కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కృష్ణవేణి

**గద్వాల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామం లో బీజేపీజెండా ఎగురాలని గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ కృష్ణ వేణి అన్నారు. భారతీయ జన తా పార్టీ 45వ ఆవిర్భావ దినో త్సవం వేడుకలలో భాగంగా గావు చలో, బస్తి చలో అభియాన్ కార్యక్రమం సందర్భంగా బుధవారం గద్వాల మండల అధ్యక్షు డు టి.శ్రీనివాసులుఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రతి బూతులో జెండా ఎగురాలన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపైన జెండా ఎగరాలన్నారు. ప్రతి కార్యకర్త ఉత్సాహంగా ప్రతి కార్యక్రమాన్ని ప్రజల దృష్టిలోకి తీసుకొని ప్రచారం చేయాలని, కేంద్ర పథకాల గురించి వివరించాలని చెప్పారు. 10,11,12 తేదీలలో అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలో చెరువులు,కుంటలు, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గద్వాల మండల అధ్యక్షుడు టి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి రోడ్లు కేంద్రం నిధులే అన్నారు. ప్రతి రేషన్ కార్డుకు 5 కేజీల బియ్యం కరోనా సంవత్సరం నుండి 2027ఒక్క రూపాయి లేకుండా నరేంద్ర మోడీ ఇస్తాఅని చెప్పడం జరిగిందన్నారు.ప్రతి గ్రామంలో బూతు అధ్యక్షుడు బూతు సమావేశం చేసుకోవాలని మండల అధ్యక్షుడు చెప్పడం జరిగినదన్నారు. ఈ సమావేశానికి ముఖ్య నాయకుల పేర్లుశీను,నరేష్‌గౌడ్, శోభారాణి మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ బాబన్న, నాగరాజు,రఘు,యుగేందర్, కురవపల్లి వెంకటేష్, ఎన్ఆర్‌కే నరసింహులు, ఎం రాములు, గోవర్ధన్, రాజు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలలో పోషణ వారోత్సవాలు

**కోయిలకొండ, ఏప్రిల్9 ప్రభాతవార్త:** మండలంలోని కొత్లాబాద్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రా లలో పోషణ వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్వాడి సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితం గడపడం కోసం నాణ్యమైన పోషక ఆహార పదార్థాలను అందజేయడం జరుగుతుందన్నారు పోషక వారోత్సవాల సందర్భంగా రకరకాల పోషక విలువలు గల ఆహారాన్ని వండి తెచ్చి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు పుష్ప,అమృతమ్మ,భారతి,అంజమ్మ, ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

# ఘనంగా బిజెపి జెండా ఆవిష్కరణ



**వనపర్తి రూరల్, ఏప్రిల్9 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వనపర్తి పట్టణంలో 11 వ, 15వ, 14వ, 17వ,32 వ వార్డులలో బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనం గా నిర్వహించారు. బుధవారం వనపర్తి పట్టణములోని వివేకా నంద చౌరస్తా కూడలిలో జరి గిన ఈ కార్యక్రమానికి బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లా డుతూ ఏప్రిల్ 6నుండి 9వ తేదీవరకు వనపర్తి నియోజకవర్గంలోని అనేక వార్డులలో, గ్రామాలలో, పార్టీ కార్యకర్తల ఇంటిపైన భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తూ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు.ప్రతి వార్డులో కూడా ముఖ్య అతిథులుగా పార్టీ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా జాయింట్ ట్రెజరర్ నారాయణదాసు జ్యోతి రమణ, పట్టణ అధ్యక్షుల ఏ.రాజశేఖర్‌గౌడ్, ఎస్టి మోర్చా పట్టణ అధ్యక్షులు శంకర్ నాయక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు మేనేజర్ అక్రమాలపై విచారణ జరపాలి

■ బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ■ జిల్లా కలెక్టరుకు రాచాల ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాచాల బృందం

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్9 ప్రభాతవార్త:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లో జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా పనిచేస్తున్న భాష్యా నాయక్ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఉన్నతాధికా రులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం రాచాల మాట్లా డుతూ వనపర్తి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరుగాకొన్నేళ్ల క్రితంనుంచి పని చేస్తున్న భాష్యా నాయక్ పై మహిళా సంఘాలు, వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వా హకుల నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఒక్కో కొను గోలు కేంద్రం నుంచి రూ.5 వేల చొప్పున, సంవత్సరానికి రూ.10లక్షలు వసూలుచేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు అందాయ న్నారు. ఆ డబ్బును నగదు రూపంలో ఫోన్ పే ద్వారా ప్రభు త్వం ఇచ్చిన ఫోన్ నంబరుకు ఫోన్ పే చేయించుకున్నాడని, దీం తో పాటు మహిళా సంఘాల్లో పనిచేస్తున్న బుక్ కీపర్లు, సీసీలు కూడా బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. డీపీఎం భాష్యా నాయక్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి అతని ఫోన్ పే నంబరుకు లింకు ఉన్న అకౌంటు లో వీవోఏల నంబర్ల నుండి వచ్చిన డబ్బులపై , సీసీ, బుక్ కీపర్ల ద్వారా వచ్చిన డబ్బులపై కూడా విచారణ జరిపి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాచాల కలెక్టరును కోరారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్ రెడ్డి, బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న,పట్టణ అధ్యక్షుడు దేవర శివ, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, గడ్డం శేఖర్, రామన్ గౌడ్, రాందాస్ నాయక్, రాజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలకు మౌలిక సదుపాయాలు

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడం తో పాటు ప్రతి పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. వరి ధాన్యం కొనుగోళ్ల కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా బుధ వారం దేవరకద్ర మండలం లక్ష్మిపల్లి గ్రామానికి విచ్చేసిన దేవ కద్ర శాసన సభ్యులు ఎమ్మెల్యే గవినోళ్ల మధు మధుసూదన్ రెడ్డిని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌యం ఎస్.కల్పనలు మర్యాద పూర్వకంగా కలిసి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 90 మంది విద్యార్థుల సౌకర్యార్థం కూర్చోవడానికి డ్యుయల్ డెస్క్ బెంచీలు మంజూరు చేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందజే శారు. ఈ విషయంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం అలుపెరగని కృషి చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మౌలికవసతులు కల్పించమన్నారు. తరగతి గదుల మరమ్మతులు, విద్యుదీకరణ, మంచి నీరు, మరుగు దొడ్లు, ఉచిత విద్యుత్ తదితరసదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. రకరకాల పెయింటింగ్‌లతో పాఠశాలల రూపు రేఖలు మారుస్తూ ఆకర్షణీ యంగా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా విద్యా రంగ అభివృద్ధికి సియం రేవంత్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యత, ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు నిల యాలుగా మారాయని అన్నారు. లక్ష్మిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం డ్యుయల్ డెస్క్‌బెంచీలు ఏర్పాటు చేయి స్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలహెచ్‌ఎం ఎస్.కల్పన,ఉన్నతపాఠశాల ఇంచార్జ్ హెచ్‌యం అస్రఖాద్రి, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, విజయలక్ష్మి, నాగేశ్వర్‌రెడ్డి, మురళీధర్, శంకర్, మదన్ మోహన్, సుజాత, కమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సమ్మేటీవ్ అసిస్మెంట్ పరీక్షలు

◆ పరిశీలించిన డీఈఓ రమేష్ కుమార్



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

**వెల్దండ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** జిల్లాలో 1వ తరగతి నుండి 9వ తరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ అసిస్మెంట్–2 పరీక్షలు సజా వుగా ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం వెల్దండ మండలం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దాపూర్, తుంకిబండ తండా ప్రాథమిక పాఠశాలలను డీఈఓ రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలల్లోనిర్వహిస్తున్న సమ్మేటివ్ అసిస్మెంట్ -2 పరీక్షల ను డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు గాలి వెలుతురు పుష్కలంగా ఉండేలా గదుల్లోనే ఏర్పాటు చేయాలని డీఈఓ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను డిఈవో పరిశీలించారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ 2 (ఎస్ఏ2) పరీక్షలు నేటి నుంచి 17వరకు పరీక్షలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పరీక్షల అనంతరం జవాబుపత్రాలను కూడా వెంటనే మూల్యాం కనం చేసి, ఏప్రిల్ 23న ఫలితాలు వెల్లడించాలని, అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, ప్రోగ్రెస్ కార్డులు అందించాలని డీఈఓ రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 1100 వివిధ మాధ్యమాల పాఠశాలల్లో 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు సుమారుగా 1 లక్షకు పైగా విద్యార్థులు నేటి నుంచి ప్రారంభమైన ఎస్ఏ 2 పరీక్షల్లో హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 11:30 గంటల వరకు 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు, ఉదయం 9 గంటల నుండి 11:45 8వ తరగతి వరకు, అదేవిధంగా ఉదయం 9 గంటల నుండి 12 00 గంటల వరకు 9వ తరగతి విద్యార్థులకుసంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ సూచించారు.డీఈఓ వెంట జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు,వెల్దండ మండల విద్యాధికారి చంద్రుడు నాయక్ ఉన్నారు.

# తెలంగాణలో రాబోయేది బిజెపినే

◆మాజీ ఎంపీ పోతుగంటి రాములు



బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పోతుగంటి

**ఉప్పునుంతల, ఏప్రిల్9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రాబో యేది బిజెపి పార్టీ నేనని, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు కట్ట సుధాకర్ రెడ్డి అన్నారు. బుధ వారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మండల బిజెపి అధ్య క్షుడు తోళ్ళ మహేష్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కట్ట సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అనుకూలంగా పనిచేస్తూ ప్రపంచ దేశాల మన్ననలు పొందారన్నారు. గ్రామ గ్రామాన బూత్ స్థాయిలో బిజెపి పార్టీని తీసుకుపోవాలని పార్టీ సంక్షేమ పథకాల ను ప్రజలకు వివరించాలన్నారు. బిజెపి పార్టీ విస్తృతస్థాయి సమా వేశాలు గ్రామ గ్రామాన నిర్వహించి పార్టీ సభ్యత్వాలు చేయాల న్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీ పోతుగంటి రాములు, రాష్ట్ర బిజెపినాయకులు కట్టసుధాకర్‌రెడ్డి, జిల్లాఅధ్యక్షుడు నరేందర్‌రావు, జిల్లా నాయకులు కుందేళ్ళ సైదులు యాదవ్, శ్రీను నాయక్, మండల బిజెపి అధ్యక్షుడు తోళ్ళ మహేష్ యాదవ్, అచ్చంపేట మండలఅధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాది వెంకట్‌శెట్టి, వావిలాల రమేష్, ఏళ్ళ సురేందర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలే లక్ష్యం

**అలంపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలగురించి గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ మెజారిటీ స్థానా లు గెలిచే విధంగా కార్యకర్తలకు కృషి చేయాలని బిజెపి జిల్లా మాజీఅధ్యక్షులు రామచంద్రారెడ్డి అన్నారు.బుధవారం మానవపాడు మండలకేంద్రంలో బిజెపి మండలఅధ్యక్షులు మురళీకృష్ణ అధ్యక్ష తన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రతి బిజెపి కార్యకర్తఇంటిపై బీజేపీ జెండాఎగరవేయాలని సూచించారు.. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ అంగన్వాడి కేంద్రాల ను సందర్శించాలని అదేవిధంగా స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రధానినరేంద్రమోడీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతుం దనికొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజశేఖర్ శర్మ, లక్ష్మినారాయణ, రాఘవయ్య, కుర్మన్న, సురేష్, వెంకటేష్, రామంజి, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక

**వెల్దండ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన స్వేరోస్ మండల సమావేశంలో సీనియర్ స్వేరోస్ దుబ్బ నాగేష్, జంగిలి నిరంజన్, ఆర్ఎస్పి ఫౌండేషన్ అశ్విన్ కుమార్‌లు ముఖ్య అతిథులు హాజరై వెల్దండ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగాగడుసు శివ, ప్రధాన కార్యదర్శిగా దొబ్బల మహేష్, ఉపాధ్యక్షులుగా ధార ప్రభాకర్, తాండ్ర శ్రీనివాసులు, కోశాధికారిగా దుబ్బ రామార్జున్, సాంస్కృతిక కార్యదర్శిగాసిరివెన్నెలు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేరో భావజాల వ్యాప్తికి పనిచేస్తామని వారు పేర్కొన్నారు. స్వేరో ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆశయ సాధనకు నిరంతరం కృషిచేస్తామని వారన్నారు. కార్యక్రమంలో సూర్య నాయకులు రాజు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధరలను తగ్గించాలని నిరసన

**ఉప్పునుంతల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** వంట గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో సిపిఎం పార్టీ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. దీంతో సామాన్యులకు గుదిబండగా మారుతుందని, పేద ప్రజలపై భారాన్ని మోపి కార్పొరేట్‌కంపెనీలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించక పోగా కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్లపై అన్నారు. వెంటనే ప్రభుత్వం వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో అరుణ, జ్యోతి, లక్ష్మమ్మ, రాధా, అలివేల తదితరులు పాల్గొన్నారు.

# నల్లగుట్టతండా పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎంఓ



**భూత్పూర్,ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సి పాలిటీ ఒకటోవార్డు నల్లగుట్టతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా అకాడెమిక్ మానిట రింగ్ అధికారి దుంకు డు శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక పరీక్షలు నడు స్తున్న నేపథ్యంలో దుంకుడు తొలిరోజు తెలుగు పరీక్ష రాస్తున్న విద్యార్థుల్ని పరిశీలించారు.

# మాతా శిశు సంరక్షణ సేవలు అందించాలి

**నవాబ్‌పేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఐఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో అందుతు న్న వైద్య సేవల గురించి స్థానిక వైద్యాధికారి డా. శ్రావణ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను టీకాల నిలువ, శీతలీకరణ స్థితిగతులను ఫార్మసిస్టు రాఘవేందర్‌ను అడిగి తెలు సుకున్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో కాన్పులు ఓపి సేవలు, మిషన్ ఇంద్రధనస్సు సర్వే గురించి అడిగారు. నవాబుపేట్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. వాక్సినేషన్ జరుగుతున్న తీరును పరిశీ లించి, పిల్లలందరికీ సకాలంలో ఇవ్వాల్సిన టీకాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్ సూపర్వైజర్ రాములు ఎంపిహెచ్ఈఓ బాలమ్మ, పీహెచ్ఎన్ శ్రీనివాసులు, జయశీల, విజయసూపర్వైజర్లు శరభలింగం, శ్రీనివాసులు హెల్త్ అసిస్టెంట్స్ స్థానిక ఏఎన్ఎం శారద ,సువార్త, కవిత, వాహబ్ ఆశా వర్కర్లు లక్ష్మి, మాధవి, సరోజ పాల్గొన్నారు.

# అంగన్వాడీలో పోషణ పక్వాడ

**చిన్నంబావి, ఏప్రిల్9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మార్చి 8 నుండి మార్చి 22 వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం లో గర్భవతులకు 1000 రోజుల ప్రాముఖ్యత,2 సంవత్సరాల పిల్లల ఎదుగుదల గురించి అవగాహన, తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలతో పాటుగా పోషకాలు గల ఆహారం ఇవ్వాలి అని, బిడ్డ మెదడు ఎదుగుదల మొదటి 2 సంవత్సరాల లోపు వేగంగా జరుగుతుందని, ఒకవేళ నిర్లక్ష్యం వహిస్తే బిడ్డ ఎదుగుదల కుంటు పడుతుందని వివరించడం జరిగింది. తీవ్ర పోషణ లోపం గల పిల్లలపేరెంట్స్‌కి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆసియా, అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, ఉష,గర్భవతులు, బాలింతలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళా మృతి

**లింగాల, ఏప్రిల్9 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళా మృతి చెందిన సంఘటన లింగాల మండలంలోని రాయ వరం గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగాల మండల కేంద్రానికి చెందిన మూడవత్ విజయ (35) కు జీల్గుపల్లి గ్రామానికి చెందిన రాంలాల్ అనే వ్యక్తితో గత కొన్ని సంవత్సరాల క్రితం వివాహం అయింది.గత కొన్ని సంవత్సరాల భర్తచనిపోవడంతో తల్లిదండ్రుల గ్రామమైన లింగాలలో నివాసం ఉంటుంది. రాయ వరం గ్రామం లో మంగళవారం నాడు ఓఇంట్లో శుభకార్యానికి వంట చేయడానికి వెళ్ళింది. వంట పనులు ముగిసిన అనంతరం తిరిగి బుధవారం లింగాలకు వస్తుండగా రాయవరం శివారులోని ఓ బావిలో స్నానం చేయడానికి వెళ్ళింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మునిగింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను బయటికి తీసేసరికి అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఒక కూతురు ఉంది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, ఏప్రిల్9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని బుధవారం ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామం లో, సన్న బియ్యం పథకంతో పాటు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడు సన్న బియ్యంతో కడుపు నిండా అన్నం తినాలన్న ధృడ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వరి ధాన్యం పండించిన ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. ప్రైవేటు షాపులను ఆశ్రయించి నష్టపోరాదన్నారు.ప్రతి రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, మార్కెట్ కమిటి చైర్మన్ సదాశివరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**మాగనూరు, ఏప్రిల్9 ప్రభాతవార్త:** గ్రామంలో తెలంగాణా ప్రభుత్వము ప్రతిష్టాత్మంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్య క్రమాన్ని మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.గతంలో ఇచ్చే రేషన్ దొడ్డు బియ్యం తినలేక అమ్ముకునేవారని దీనిని తెలంగాణ ప్రభుత్వాము దృష్టిలో పెట్టుకొని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యము పంపిణీ చేస్తే నిరుపేదలు కడుపునిండా తింటారనే ఉద్దేశంతో పంపిణీ చెయ్యడం జరిగిందని అన్నారు. డీలర్ బాల్ రెడ్డి నాయకులను అధికారులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో విండో ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ఎంపిడిఓరహమతుద్దీన్. రెవెన్యూఇన్స్పెక్టర్ బాలరాజు, పంచా యతీ కార్యదర్శి నరసింహ రెడ్డి. కాంగ్రెస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ అంజమ్మ, శంకర్, లోకపల్లి మారెప్ప, తాయప్ప, ఆర్.వెంకట్‌రెడ్డి, సిద్దప్ప, హన్మంతు, డీలర్‌బల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలంటూ నిరసన

**కల్వకుర్తి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రిస్తామని సూచించిన బీజేపీ ప్రభుత్వం అన్ని రకాల వస్తువులపై ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు 130.5 శాతం పెంచడంతో పాటు సబ్సిడీని ఎత్తివేసిందన్నారు. బుధవారం సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండల తహసీల్దార్ ఇబ్ర హీంకు వినతి పత్రం అందజేశారు.వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పులిజాల పరుశరాములు, నాయకులు చిలుక బాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మార్చాల మాజీ ఎంపిటిసి కడల సంతోషి మల్లేష్, పార్టీ జనరల్ సెక్రటరీ దొక్క లింగమయ్య, నాయకులు కే.శ్రీను, జంగయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకట స్వామి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌరస్తా నందు గ్యాస్ సిలిండర్ లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు 2024 నుంచి తగ్గాయని ఇటీవలి కాలంలో అవి మరింత తగ్గాయని, కానీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి సిలిండర్ పై 50 రూపాయలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల సబ్సిడీ సబ్సిడీయేతర వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడనున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగే గ్యాస్ ధరల ప్రభావం మిగతా నిత్యవసర వస్తు ధరల పై కూడా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ భయంతో ప్రజలు అల్లాడుతుంటే ఉపాధి పెంచి ధరలను తగ్గించాల్సింది పోయి, కేంద్రం గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలను వేస్తున్నదని విమర్శించారు. దీనివల్ల నెలకు జిల్లా ప్రజలపై అదనంగా రూ.15,57000 భారం పడుతుందని కేంద్ర ప్రభుత్వ నిర్ణయా నికి వ్యతిరేకంగా జిల్లా ప్రజలు కూడా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ,నాయకులు చందు,నరేష్, నందహరి, గోవింద్, పరుష రాముడు,టి.నరేష్ ఆనంద్,విరేష్‌లు పాల్గొన్నారు.

